వలంటీర్‌పై ఫిర్యాదు

పార్వతీపురం రూరల్: అడ్డాపుశీల పంచాయతీలో ఓ వలంటీర్‌పై ఎంపీడీవో షేక్ మహమ్మద్ అకీబ్ జావేద్‌కు ఫిర్యాదు చేసినట్లు టీడీపీ మండల నాయకుడు శివకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..ఆ పంచాయతీలో సీహెచ్ గవరరాజు దివ్యాంగుల పింఛన్ పొందుతుండగా.. పోస్టల్ బ్యాలెట్ కోసం 12డీ దర ఖాస్తుపై సంతకం చేయాలని ఆయనపై ఒక వలంటీర్ ఒత్తిడి తెచ్చినట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. దివ్యాంగుల ఓట్లు కోసం అధికార పార్టీ ఇలా వలంటీర్లను రంగంలోకి దించడం సరికాదన్నారు.

నాడు ఆదర్శం.. నేడు అధ్వానం

- గాడి తప్పిన సాలూరు డంపింగ్ యార్డు నిర్వహణ
- ఒకప్పుడు అవార్డులు, రివార్డులు, ప్రశంసలు
- జాతీయ స్థాయిలో గుర్తింపు.. ప్రస్తుతం దయనీయ పరిస్థితి
- వైసీపీ పాలనలో పూర్తిగా గాలికొదిలేసిన వైనం



డంపింగ్ యార్డులో చెత్తను కాల్చుతున్న దృశ్యం

సాలూరు, మార్చి 24

డంపింగ్‌యార్డు నిర్వహణలో ఒకప్పుడు జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన సాలూరు పురపాలక సంఘం నేడు విమర్శల పాలవుతోంది. క్లీన్ ఎర్త్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు ఇలా ఎన్నో అవార్డులు, రివార్డులు, ప్రశంసలు అందుకున్న యార్డు నిర్వహణను గాలికొదిలేయడమే ఇందుకు కారణం. దీర్ఘకాలంగా దీనిని పట్టించుకునే వారే కరువయ్యారు. ఒకప్పుడు ఆహ్లాదకర ప్రదేశంగా ఎన్నో మున్సిపాల్టీలకు ఆదర్శంగా నిలిచిన యార్డు నేడు పరమ అధ్వానంగా మారింది. చెత్తకుప్పలు, వ్యర్థాలు, దుర్గంధంతో అటువైపు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోనూ పారిశుధ్యం క్షీణించింది. ఎక్కడికక్కడ చెత్తాచెదారం దర్శనమిస్తోంది. మరోవైపు లక్షలాది రుపాయలతో కొనుగోలు చేసిన పారిశుధ్య యంత్రాలు కూడా మూలకు చేరాయి. వాటిని పర్యవేక్షించే వారే కరువయ్యారు. స్వచ్ఛ మున్సిపాల్టీగా పేరొందిన సాలూరులో నెలకొన్న పరిస్థితిపై పట్టణవాసులు పెదవి విరుస్తున్నారు. పాలకవర్గం, అధికారుల చి(చె)త్త శుద్ధి ఇదేనా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా 2011 నుంచి 2015 వరకు పనిచేసిన షేక్ సుభానీ సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరువలో సుమారు 8.4 ఎకరాల విస్తీర్ణంలో అత్యంత సుందరంగా డంపింగ్ యార్డు నిర్మించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 13,14వ ఆర్థిక సంఘంతో పాటు మున్సిపాల్టీ నిధులు ఇందుకోసం వెచ్చించారు. యార్డులో అంతర్గత రహదారులు, చెత్తలకు సంబంధించి షెడ్లు, ఆహ్లాదపరిచే మొక్కలు, ఓ కొలను(చెరువు), పార్వతీపరమేశ్వరులు, నంది, వినాయకుడు విగ్రహాలను ఏర్పాటు చేశారు. అందర్నీ ఆకట్టుకునే విధంగా డంపింగ్‌యార్డును తీర్చిదిద్దడమే కాకుండా ఆ ప్రాంతం లో తన ఇద్దరు కుమార్తెల వివాహాలు కూడా చేసి రాష్ట్రంలో అన్ని మున్సిపాల్టీల దృష్టిని ఆకర్షించారు. అంతేకాదు డంపింగ్ యార్డులో చెత్త సంపద కేంద్రం ద్వారా మున్సిపాల్టీకి ఆదాయం వచ్చేలా చేశారు. దీంతో సాలూరు మున్సిపాల్టీకి ఎన్నో అవార్డులు, రివార్డులు, ప్రశంసలు దక్కాయి. అయితే నేడు యార్డు పరిస్థితి దయనీయంగా మారింది. దానిని పట్టించుకునే వారే కరువయ్యారు. చెత్తను వేరు చేయడం మాట అలా ఉంచితే.. వాటిని పూర్తిగా కాల్చేస్తున్నారు. దీంతో అటుగా వాకింగ్‌కు వెళ్లే వారు, నివాసితులు నానా అవస్థలు పడుతున్నారు. పొగ కారణంగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ఆదాయం ఏమవుతుందో?

మున్సిపాల్టీలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసిన మొదట్లో ఏడాదికి సుమారు రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రూ.20 వేలకు మించి రావడం లేదు. మరోవైపు డంపింగ్‌యార్డులో ఉన్న చెత్తసంపద కేంద్రం కూడా పూర్తిగా మూత పడింది. దీనిపై అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. 2018లో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు మున్సిపాల్టీ పరిధిలో ఉన్న తడిచెత్తను సంఘ మిత్ర రీసెర్చ్ ట్రైనింగ్ అండ్ కన్సల్టెన్సీ వారికి ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 20 ఏళ్ల పాటు ఇలా ఇవ్వాల్సి ఉందని వారు తెలియజేస్తున్నారు. మరి పొడి చెత్త, ప్లాస్టిక్‌తో పాటు అనేక వ్యర్థాల వచ్చే ఆదాయం ఏమవుతుంది.. ఎక్కడికి వెళ్తుందనేది మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. ఇకపోతే ఏరోజుకారోజు యార్డులో చెత్తను కాల్చుతుండగా.. ఆ బూడిదను ఇటుక బట్టీలు ఇస్తున్నారు. మరి దాని ద్వారా ఎంత ఆదాయం వస్తుందో తెలియని పరిస్థితి.

నిధులున్నా.. సాగని పనులు

2022లో పట్టణంలోని బంగారమ్మపేటలో 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ. 56 లక్షలతో చెత్త తరలింపు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రంగం సిద్ధం చేశారు. అయితే జనావాసాల మధ్య చెత్త తరలింపు కేంద్రం ఏర్పాటు చేయడం తగదని పెద్దఎత్తున ఆ ప్రాంతవాసులు రోడ్డుపై భైఠాయించి నిరసన తెలిపారు. దీంతో అధికారులు, పాలక వర్గ సభ్యులు వెనకడుగు వేశారు. పట్టణ పరిధిలోని దగ్ధసాగరం సమీపంలో మున్సిపాల్టీకి చెందిన సర్వే నెంబర్ 313లో ఉన్న 42 సెంట్లలో దానిని ఏర్పాటు చేయాలని అనుకున్నారు. అందులో షెడ్లు, వాచ్‌మెన్ క్వార్టర్‌తోపాటు కాంపౌడ్ వాల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అయితే చెత్త తరలింపు కేంద్రాన్ని ఆ ప్రాంతానికి సమీపంలోనే ఉన్న డంపింగ్ యార్డులో ఏర్పాటు చేస్తే వచ్చే ఇబ్బందులు ఏమిటో అర్థం కాని పరిస్థితి. ఏదేమైనా చెత్త తరలింపు పనులు మాత్రం ముందుకు సాగలేదు. నిధులు మాత్రమే అలానే ఉన్నాయి నేటికీ ఆ దిశగా అధికారులు పనులు చేపట్టకపోవడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు.

యంత్రాలన్నీ మూలకు...

మున్సిపాల్టీకి చెందిన పారిశుధ్య యంత్రాలన్నీ మూలకు చేరాయి. ప్రధానంగా బాబ్‌కార్ట్, ఆటోలు, స్వీపింగ్, పల్వరైజ్డ్ యంత్రాలు, డంపర్ బీన్లు, తోపుడు బండ్లు, చెత్త సేకరించే బుట్టలు, ట్రాక్టర్ ఇలా ఎన్నో మరమ్మతులకు గురయ్యాయి. వాటిని బాగు చేసి వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అవి మూలనపడి మరింతగా పాడవుతున్నాయి. ఇటీవల కాలంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.25 లక్షలతో ఓ జేసీబీని కొని పూజలు చేసిన అధికారులు దానిని వినియోగంలోకి తీసుకురాలేదు సరికాదా కనీసం భద్రపరిచే చర్యలు కూడా తీసుకోలేదు.

ఎక్కడి చెత్త అక్కడే..

మున్సిపాల్టీలో అనేక వార్డుల్లో ఎక్కడికక్కడే చెత్తాచెదారం దర్శనమిస్తున్నాయి. రోజురోజుకూ పారిశుధ్యం క్షీణిస్తున్నా స్పందించే వారే కరువయ్యారు. పూర్తిస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం దోమలు, ఈగల బెడదతో నానా అవస్థలు పడుతున్నారు. తరచూ రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య మెరుగు, డంపింగ్ యార్డు నిర్వహణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



మూలకు చేరిన యంత్రం

సుందరంగా తీర్చిదిద్దుతాం..

గతంలో ఉన్న మాదిరిగా డంపింగ్‌యార్డును సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తాం. పూర్తిస్థాయిలో దృష్టి పెడతాం. మున్సిపాల్టీకి ఆదాయం వచ్చేలా చేస్తాం

-కె.పకీర్‌రాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సాలూరు

ఉన్నతాధికారుల దృష్టికి..

మున్సిపాల్టీలో చెత్త తరలింపు కేంద్రం ఏర్పాటు విషయాన్ని మళ్లీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిధులు వినియోగం లోకి వచ్చేలా చూస్తాం

-సూరినాయుడు, ఏఈ, సాలూరు మున్సిపాల్టీ

క్షయ రహిత సమాజమే లక్ష్యం

- డీఎంహెచ్‌వో జగన్నాథరావు

పార్వతీపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎన్జీవో హోంలో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, కఫం, జ్వరం, బరువు, ఆకలి తగ్గడం, ఉమ్మిలో రక్తం పడడం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలన్నారు. అన్ని ఆసుపత్రుల్లో ఉచితంగా కఫం, ఎక్స్‌రే, సిబినాట్, ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. బాధితులు ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. 21 నెలల పాటు రూ2 లక్షలు విలువ చేసే మందులు ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. జిల్లాలో 43 డిజిగ్నేటెడ్ మైక్రోస్కోప్ సెంటర్లు, ఏడు టీబీ యూనిట్లను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 230 మందిని గుర్తించి చికిత్స అందించామన్నారు. జిల్లాలో 16 క్షయరహిత పంచాయతీలను ఎంపిక చేశామని తెలిపారు. మందులు వాడుతున్న వారి ఖాతాల్లో ఆరు నెలలకు రూ.మూడు వేలు జమవుతుం దన్నారు. పీహెచ్‌సీలకు వచ్చే వారిలో కనీసం 10 నుంచి 15 శాతం మందికి కఫం పరీక్షలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు క్షయ బాధితులను పరామర్శించాలన్నారు. మందులు వేసుకుంటున్నారో లేదో గమనించడమే కాకుండా ప్రతిరెండు నెలలకు ఒకసారి వారికి కఫం పరీక్షలకు పంపించాలని సూచించారు. జిల్లా సమాచార పౌర సం బంధాల అధికారి ఎల్.రమేష్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తే.. బాధితులకు మానసిక, ఆర్థిక, ఒత్తిడి నుంచి దూరం చేయొచ్చని తెలిపారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వివేక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శివశంకర్, ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్, వైద్యుడు దుర్గాప్రసాద్, డీఎల్‌ఏటీవో తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగన్నాథరావు

రెండేళ్లు గడుస్తున్నా..



ఇది వీరఘట్టంలోని పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారి. విస్తరణ పనులు చేపట్టి రెండేళ్లు గడుస్తున్నా.. ఇంకా కొలిక్కి రాలేదు. ఆ ప్రాంతంలో కాలువ పనులు కూడా పూర్తిస్థాయిలో చేపట్టలేదు. దీంతో స్థానికులు, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ దారి మీదుగా పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం, రాజాంతో పాటు ఒడిశా రాయగడ తదితర ప్రాంతాలకు బస్సులు, ప్రైవేట్ వాహనాలు వంద లాదిగా రాక పోకలు సాగిస్తుంటాయి. ఇంత కీలకమైన ఈ రోడ్డు విస్తరణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. నెలలు గడుస్తున్నా.. అతీగతీలేదు. ప్రస్తుతం రహ దారి రాళ్లు తేలి.. గుంతలమయంగా మారింది. తరచూ దుమ్ము రేగుతుం డడంతో ఈ మార్గంలో ప్రయాణించడం కష్టతరంగా మారింది. వాహనాలు మరమ్మతులకు గురవుతుండగా, ద్విచక్రవాహనదారులు గుంతల్లో పడి క్షతగాత్రులుగా మారుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి పనులు పూర్తి చేయాలని ఆ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈ జగన్మోహన్ రాజును వివరణ కోరగా బిల్లులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.



- వీరఘట్టం

చెక్‌పోస్టుల తనిఖీ

కొమరాడ, మార్చి 24 : జిల్లా పరిధిలో ఏవోబీ సరిహద్దు కూనేరు గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఆదివారం పార్వతీపురం ఏఎస్పీ సునీల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూనేరు మీదుగా ఏపీలోకి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో పెద్ద మొత్తంలో డబ్బు, ఇతరత్రా వస్తువులు, నిషేధిత గుట్కా, ఖైనీ ప్యాకెట్లు, సారా, గంజాయి రవాణాపై ప్రత్యేంగా దృష్టి సారించాలని ఆయన సిబ్బందికి సూచించారు. రశీదులు, ఎటువంటి పత్రాలు లేకుండా రవాణా చేసే వాటిని సీజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన కొమరాడ, కూనేరు రామభద్రపురం గ్రామాల వద్ద నాగావళి నదిలో ఇసుక రీచ్‌లు పరిశీలించారు. ఇసుక రవా ణాపై నిఘా ఉంచినట్లు తెలిపారు. కొమరాడ ఎస్‌ఐ నీలకంఠం తదితరులు ఉన్నారు.



చెక్‌పోస్టు వద్ద కారును పరిశీలిస్తున్న ఏఎస్పీ సునీల్

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

- డీఎస్పీ కృష్ణారావు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

పాలకొండ, మార్చి 24: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు డీఎస్పీ జీవీ కృష్ణారావు తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని పారాపురం గ్రామంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో వసతులపై ఆరా తీశారు. ఎంతమంది ఓటర్లు ఉన్నారన్న విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ రోజున పటిష్ఠ భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ప్రశాంత ఎన్నికల కోసం గ్రామస్థులు సహకరించాలని కోరారు. గొడవలు, ఘర్షణలు, వాగ్వాదాలకు దిగరాదని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సీఐ చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

పనస ధర పతనం

- కిలో రూ.5 పలుకుతున్న వైనం
- ఆవేదనలో గిరిజన రైతులు
- అధికారులు ఆదుకోవాలని విన్నపం





గిరిజన రైతులు సేకరించిన పనసకాయలు

సీతంపేట

ఏజెన్సీ ప్రాంతంలో విరివిగా లభ్యమయ్యే పనసకాయల ధర ఒక్కసారిగా పడిపోయింది. కిలో ధర రూ.5కు పలుకుతుండడంతో గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు. వాటిని అమ్ముకోలేక .. నిల్వ చేసుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. గత వారం కిలో ధర రూ.20 నుంచి రూ.40 వరకు ఉండగా.. విక్రయాలు బాగానే జరిగాయి. అయితే ఈ వారంలో వాటి ధర ఒక్కసారిగా ఐదు రూపాయలకు పడిపోవడంతో కనీసం రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. వాస్తవంగా సీతంపేట మన్యంలో లభ్యమయ్యే పనసకాయలకు మంచి డిమాండ్ ఉంది. శుభకార్యాలు, పెళ్లిళ్లలో పనసతో వివిధ వంటకాలు కూడా చేస్తుంటారు. దీంతో ఇక్కడ నుంచి ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, పశ్చిమబెంగాల్, అస్సాం ప్రాంతాలకు వ్యాపారులు పెద్ద ఎత్తున తరలిస్తుంటారు. దీంతో ఏటా ఈ ప్రాంతంలో రూ.కోటి నుంచి రూ. రెండు కోట్ల వరకు వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయి. అయితే ఈ ఏడాదిలో ఒక్కసారిగా ధర తగ్గిపోవడంతో గిరిజన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

వీడీవీకేలు ఉన్నా..

వాస్తవంగా ఐటీడీఏ పరిధిలో 66 వన్‌ధన్ వికాస్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ బాధ్యతను జీసీసీకి అప్పగించారు. ఆ తర్వాత రైతు ఉత్పత్తి సంఘాలు కూడా ఏర్పాటు చేశారు. అవి గిరిజన రైతుల నుంచి సీజనల్ వారీగా అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసి .. మార్కెట్లో విక్రయాలకు ప్రోత్సాహం అందించాల్సి ఉంది. అయితే వీడీవీకేలు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉండడంతో గిరిజన రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు వ్యాపారులు కూడా సిండికేట్‌గా మారి తక్కువ ధరకు పంటను కొనుగోలు చేస్తున్నారు. కాగా వీడీవీకేల నిర్వహణ సక్రమంగా లేదని గతంలో వెలుగు ఏపీడీని ఐటీడీఏపీ పీవో సస్పెండ్ చేశారు. అయినా అధికారుల తీరు మారడం లేదు. దీంతో గిరిజన రైతులు ఏటా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, ఆర్థికంగా ఆదుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి తక్కువ ధరకు పనస కాయలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో మేము తీవ్రంగా నష్టపోతున్నాం. ఏటా ఇదే పరిస్థితి. వీడీవీకేలు ఉన్నా.. మాకు ఎలాంటి ప్రయోజనం లేదు. పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. దీంతో కొన్నేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలి.

- బాపయ్య, గిరిజన రైతు, పొంజార గ్రామం

నేటి నుంచి అగ్నిగంగమ్మ జాతర



పూజలందుకున్న అమ్మవారి ఘటాలు

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో ఉన్న నీలావడి అగ్ని గంగమ్మ జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కోరాపుట్ జిల్లా బందుగాం బ్లాక్ పరిధిలో ఉన్న నీలావడి గ్రామంలో మూడు రోజుల పాటు ఈ జాతర జరగనుంది. 25న తొలేళ్ల, 26న నిప్పులు తొక్కడం, 27న అనుపోత్సవం నిర్వహించనున్నారు. అగ్నిగంగమ్మ జాతరకు పార్వతీపురం పట్టణం, మండలం, సాలూరు, ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా నుంచి పెద్దఎత్తున భక్తులు తరలిరానున్నారు. మంగళవారం అగ్ని నిప్పులపై నడిచి తమ మొక్కులు చెల్లించుకోనున్నారు. ఆదివారం కూడా పెద్దఎత్తున భక్తజనం ఆలయానికి చేరుకుని అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒడిశా పోలీసులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

అభివృద్ధిని మరిచారు

- రాజానగర్‌లో సమస్యల తిష్ఠ
- పని చేయని పైలట్ వాటర్ స్కీం
- కానరాని కాలువలు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



రాజానగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

బొబ్బిలి మార్చి 24: బొబ్బిలి పట్టణం 8వ వార్డు పరిధిలోని రాజానగర్ కాలనీ అభివృద్ధికి ఆమ డ దూరంలో ఉంది. కాలనీలో అనేక సమస్యలు తిష్ఠ వేశాయి. పేరుకే రాజా తప్ప, సౌకర్యాల కల్పనలో అలాంటిదేమీ అక్కడ కనిపించదు. కాలనీ వాసుల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన పైలట్ వాటర్ స్కీం ఏడాదిన్నరగా పడకేసింది. మోటారు నిరుపయోగంగా పడిఉంది. కాలనీ పరిసరాలన్నీ అపరిశుభ్రంగా ఉన్నాయి. ఎక్కడపడితే అక్కడే చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. ఈ కాలనీని ఆనుకొని భైరిసాగరం చెరువు ఉంది. ఈ ప్రాంతమంతా షరామామూలుగానే కబ్జాలకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పాములు, తేళ్ల వంటి విషసర్పాల బెడద ఎక్కువగా ఉండడంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. కాలనీ ఇళ్లకు ఆనుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రహరీ నిర్మించడంతో మురుగునీరు వెళ్లేందుకు మార్గం లేక నానా అవస్థలు పడుతున్నట్లు కాలనీవాసులు గగ్గోలు పెడుతున్నారు. కాలనీని ఆనుకొని ఉన్న శ్మశాన వాటికను సుమారు 8 వార్డులకు పైగా ప్రజలు వినియోగిస్తున్నారు. కానీ, దీని బాగోగులు పట్టించుకున్న వారు కరువయ్యారు. ఆర్థికసంఘం నిధులతో ఈ శ్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టి దాదాపు ఐదేళ్లు కావస్తున్నప్పటికీ ఆ పనులను ఇప్పటికీ పూర్తి చేయడం లేదు. ప్రహరీ నిర్మాణం అర్ధాంతరంగా వదిలేశారు. వర్షాకాలంలో చెరువు నిండినప్పుడు శ్మశానంలోకి నీరు భారీగా చేరుతుంది. అలాంటి సమయంలో మృతదేహాలకు అంత్యక్రియలు జరిపేందుకు సరైన దారి లేక నరకయాతన పడాల్సి వస్తుంది. రోడ్డుపైనే అంత్యక్రియలు జరిపిన సందర్భాలు చాలా ఉన్నాయి. శ్మశాన వాటిక పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కాలనీవాసులతో పాటు ఆయా వార్డు కౌన్సిలర్లు రాంబార్కి. శరత్‌బాబు, వెలగాడ హైమావతి, దిబ్బ సునీతాగోపి తదితరులు డిమాండ్ చేస్తున్నారు.



నిరుపయోగంగా ఉన్న తాగునీటి పైలట్ స్కీం



నిలిచిపోయిన శ్మశానవాటిక ప్రహరీ

ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయాలి



పైలట్ వాటర్ స్కీము ఏడాదిన్నరగా పనిచేయడం లేదు. కుళాయిల ద్వారా నీరిస్తున్నారు. ఇంటింటి కుళాయిలు మంజూరు చేస్తే తాగునీటి సమస్య ఉండదు. రోడ్లు ఉన్నాయి కాని కాలువలు లేవు. కాలనీ చుట్టూ సరిహద్దులు నిర్ణయించి అభివృద్ధి చేయాలి. సుందరమైన కాలనీగా తయారు చేయాలి.

-లక్ష్మి, రాజానగర్ కాలనీ

టీడీపీతోనే బీసీలకు సముచిత స్థానం

విజయనగరం రూరల్: టీడీపీ హయాంలోనే బీసీలకు సముచిత స్థానం లభించిందని ఆ పార్టీ బీసీ విభాగం నేతలు కంది మురళీనాయుడు, కోండ్రు శ్రీనివాసరావు తెలిపారు. టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు విజయనగరం నియోజకవర్గ పరిధిలో క్లస్టర్ వారీగా 'జయహో బీసీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ రాష్ట్రశాఖ మంగళగిరి వేదికగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్ కరపత్రాలను ఈ సమావేశంలో బీసీ నేతలు ఆవిష్కరించారు. టీడీపీ బీసీ విభాగం నాయకులు మామిడి దేవేంద్రనాథ్, బోని కుమార్, ఎస్సీ సెల్ నాయకుడు షైలిపిల్లి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

భూమిని కబ్జా చేయడం దారుణం

విజయనగరం రూరల్: కబ్జాకి కాదేదీ అనర్హం అన్నట్టు చివరకు పేదరిక గీత దిగువన ఉన్న చేనేత కార్మికుల భూమిని కూడా వైసీపీ నేతలు కబ్జా చేశారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని టీడీపీ రాష్ట్ర పద్మశాలి సాధికారిక కమిటీ ప్రతినిధి మామిడి దేవంద్రనాథ్ చెప్పారు. ఆదివారం అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవదార గ్రామంలో పాల సుబ్బారావు అనే చేనేత కార్మికుడు, అతని కుటుంబం ఆత్మహత్యకు ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఆయన కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, ఆల్తి బంగారు బాబు, గంటా పోలినాయుడు, కంది సాయి జగ్గారావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వంగర: నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారైనా కేసులు నమోదుకు వెనుకాడబోనని ఎస్ఐ జనార్దన్ హెచ్చరించారు. ఆదివారం మగ్గురులో వాహనాల తనిఖీలు నిర్వహించారు.

నేడు సాయినాథ ఆలయ వార్షికోత్సవం

వంగర: మడ్డువలస రిజర్వాయర్ సమీపంలో గిరిపై గల సాయినాథుని ఆలయంలో సోమవారం 14 వార్షికో త్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద్, వెంకటరావు, అర్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం సాయినాథుని పల్లకి ఊరేగింపు చేపడతామని పేర్కొన్నారు

45 మంది రక్తదానం

రాజాం: సినీనటుడు రామ్‌చరణ్ జన్మదినం రాజాం పట్టణ చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు గోక కొండలరావు, జనార్దనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 45 మంది రామ్‌చరణ్ అభిమానులు రక్తదానం చేశారు. బి.రమణ, సాయికుమార్, అశోక్, రామారావు, చైతన్యకుమార్ పాల్గొన్నారు.

హిందీ ప్రచారసభ
పరీక్ష ఫలితాలు విడుదల

రాజాం రూరల్: దక్షిణభారత హిందీ ప్రచారసభ (మద్రాస్) ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదలచేసినట్లు హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు ఆదివారం ఒక ప్రకట నలో తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారధ, ప్రవీణ వరకు ఫిబ్రవరిలో పరీక్షలు నిర్వహిం చినట్లు పేర్కొన్నారు. ఫలితాల కోసం పరీక్షార్థులు 9949917365 నంబరుకు కాల్ చేసి సమాచారం పొందవచ్చని తెలిపారు.

మునకలవలసలో ఎన్ఎస్ఎస్ శిబిరం

రేగిడి: మండలంలో మునకలవలసలో వారం రోజుల నుంచి రాజాం జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వహిస్తున్న శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వారంరోజులపాటుగ్రామంలో ఆరోగ్య శిబిరాలు, పారిశుధ్య, చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం సామాజికసేవ యువత భాగస్వామ్యంపై చైతన్యం కల్పించి, వివిధరంగాల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు బహుమతులు ప్రదానంచేశారు.

టీబీ దినోత్సవ ర్యాలీ

లక్కవరపుకోట(కొత్తవలస): మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం ప్రపంచ టీబీ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధి కారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల విద్యా ర్థులతో ర్యాలీ నిర్వహించారు. 'టీబీ అంతం-దేశం పంతం' అనే నినాదంతో ర్యాలీ చేపట్టారు. చుట్ట, బీడీ, సిగరెట్ ఈ వ్యాధికి మూలకారణమని, అత్యాధునిక మందులు టీబీకి అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ పద్మావతి, హెచ్ఎస్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: చిన్ననాటి నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ శాఖ అధికారి సి.హెచ్.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో పిల్లలకు క్విజ్ పోటీలు, వ్యాస రచనలు, చదివించడం జరిగిందని ఆయన తెలిపారు.

టీడీపీలోకి చేరికలు



పార్టీలో చేరిన వారితో టీడీపీ నాయకులు

విజయనగరం రూరల్, మార్చి 24: విజయనగరం మండలం గుండాల పేట సర్పంచ్ కంది జగదీశ్వరి ఆదివారం తన భర్త, అనుచరులు, వైసీపీ నాయకులతో కలిసి టీడీపీలో చేరారు. టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారికి అదితి గజపతిరాజు పసుపు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కంది జగదీశ్వరీతో పాటు, ఆమె భర్త కంది మహేష్, వార్డు మెంబర్లు మాట్లాడుతూ, గ్రామంలో టీడీపీని బలోపేతం చేస్తామన్నారు. టీడీపీ నాయకులు కంది సాయిజగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీని మత్తులో ముంచేస్తున్నారు..: కోళ్ల



మాట్లాడుతున్న కోళ్ల

లక్కవరపుకోట, మార్చి 24: వైసీపీ నేత జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను మత్తాంధ్రప్రదేశ్‌గా మార్చేసి యువతను నిర్వీ ర్యం చేస్తున్నారని ఎస్.కో ట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి తెలిపారు. ఆదివారం ఆమె తన నివాసం వద్ద విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలపై యువత ప్రశ్నిస్తారని, వారిని మత్తుకు అలవాటు చేస్తున్నాడని జగన్‌పై మండిపడ్డారు. విశాఖను రాజధానిగా చేస్తామన్న జగన్ డ్రగ్స్‌కి రాజధానిగా చేశారని మండిపడ్డారు. జగన్ చేసిన మాఫియాతో విశాఖ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొటాన విజయ్, భూపాల్‌నాయుడు, కృష్ణ, సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత జీవితాలు నాశనం: అదితి

విజయనగరం రూరల్, మార్చి 24: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని యువత జీవితాలను నాశనం చేశారని, ఈ రాష్ట్రాన్ని డ్రగ్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని టీడీపీ, జనసేన, బీజేపి ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు ధ్వజమెత్తారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. బ్రెజిల్ నుంచి డ్రగ్స్ వచ్చాయని, దేశంలో ఎక్కడ డ్రగ్స్‌కి సంబంధించిన కేసు నమోదు అయినా, దానికి మూలాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉంటున్నాయన్నారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాల తరలింపు కేసులు ఎక్కువగా ఉంటున్నాయన్నారు. ప్రభుత్వ విధానాల కారణంగానే ఈ విధంగా రాష్ట్రంలో డ్రగ్స్ రవాణాతో పాటు, డ్రగ్స్ సేవించే వారి సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, కంది సాయి జగ్గారావు, వేచలపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బుచ్చింపేటలో బూరెల పండుగ

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని బుచ్చింపేటలో రామమందిరం ప్రతిష్ఠ పురస్కరించుకుని బూరెల పండుగ ఆదివారం నిర్వహించారు. తొలుత స్వామి వారి కల్యాణం అర్చకులు రంపు హనుమంతు శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారి ఆలయం పైనుంచి బూరులు విసిరే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం 10వేల మందికి నిర్వహించారు.

దేవుదళలో దివ్యజ్ఞాన సత్సంగం

రేగిడి:మండలంలోని దేవుదళ గీతామందిరంలో మందిర కన్వీనర్ గొర్లి దామోదర్‌రావు అధ్యక్షతన ఆదివారం దివజ్ఞాన సత్సంగ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పాలకొం డ సత్యసాయి ప్రతినిధి ఎన్‌వీ రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గీతాపారాయణ చేయాలని తెలిపారు. పాలకొండ సత్యసాయి ప్రతినిధి ఎన్‌వీ రమణ, పలువరు వక్తలు పేర్కొ న్నారు. కార్యక్రమంలో నిత్యస్మరనాంద స్వామీజీ, శివేంద్రస్వామిజీ, త్రినాథరావు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో బేబీనాయన



పూజలు చేస్తున్న బేబీనాయన

తెర్లాం: మండలంలో విజయ రాంపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మిగణపతి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా హజరయ్యారు. లక్ష్మిగణపతి విగ్రహాలను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త బూరి శ్రీనివాసరావు, ఉత్సవ కమిటి పెద్దలతో అలయ రూపకల్పక గూర్చి చర్చించారు. అనంతరం అలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటి ఎర్పాటు చేసిన తీర్థాప్రసాదాలను తీసుకున్నారు. పాటుజనసేన నాయకులు గిరడ అప్పలస్వామి, మండల నాయకులు,గ్రామ నాయకులు పాల్గొన్నారు.

బీసీలపై వేధింపులు మానుకోవాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

రాజాం: బీసీలపై వేధింపులు మానుకోవాలని టీడీపీ బీసీ సెల్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు గురవాన నారా యణరావు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు రగుమం డల గణపతినాయుడు, ముగడ శ్రీను నాగళ్ల అప్పలనాయుడు డిమాండ్ చేశా రు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలోని కొత్తమాధవపురం గ్రామానికి చెందిన పాల సుబ్బారావు భార్య పద్మావతి చిన్న కుమార్తె వినయలు ఆత్మహత్యకు పాల్పడడంపై ఆదివారం రాత్రి రాజాం లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ బడుగులను బలితీసుకోవడమే సామాజిక న్యాయమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాడుగుల జయరాం, మొగదాల సతీష్, పిల్లా సత్యంనాయుడు, రౌతు వెంకటరమణ, మురళి పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌తో సుజయ్ భేటీ

బొబ్బిలి, మార్చి 24: జనసేన పా ర్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌తో బొబ్బిలికి చెందిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి, తూర్పుగోదావరిజిల్లా పార్టీ పరిశీ లకునిగా వ్యవహరిస్తున్న ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు ఆదివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. మంగళగిరిలో గల జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో పిఠాపురం టీడీపీ ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ఎన్ వర్మతో కలిసి సుజయ్ భేటీ అయ్యారు. తాజా రాజకీ య పరిణామాలతో పాటు రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలపై చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

సీతారామాలయ ప్రారంభోత్సవం



సామూహిక పూజలు దృశ్యం

రేగిడి: మండలంలోని వన్నలిలో కోదండ సీతారామలయ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా జరుగుతోంది. ఆదివారం ఖండ్యాం వేద పండితులు అంపోలు రుద్రకోటేశ్వరశర్మ ఆధ్వ ర్యంలో సాముహిక పూజలతో పాటు, సర్వదేవతా హామాలు, క్షీరాధివాసం,అరుణ పారాయణ పూర్వక సూర్య నమస్కారాలు, ధాన్యదివాసం, కళాహోమం నిర్వహించారు. కార్య క్రమంలో పురోహితులు వేమకోటి సుబ్రహ్మణ్యశర్మ, సర్పంచ్ గార రమణ పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తీర్థం



ఆకట్టుకుంటున్న చిన్నారులు వేసిన బండ్ల వేషాలు

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో గ్రామదేవత ముత్యాలమ్మతల్లి అమ్మవారి మొదటి తీర్థమహోత్సవం ఆధివారం వైదభవోపేతంగా జరిగింది. అమ్మవారి తీర్థమహోత్సవాన్ని పురష్కరించుకొని అరిగిపాలెం, సోంపురం జంట గ్రామాల ప్రజలు వేకువజాము నుండే అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకోవడంతో పాటు చీర, పసుపు కుంకాలను సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాటు చేసిన తీన్మార్ వాయిద్యాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే సా యంత్రం గ్రామస్థులు వేసిన చిన్నపల్లిల బండ్ల వేషాలు ఎంతగానో అలరించా యని చెప్పవచ్చును. ఆది, సోమ, మంగళవారాల్లో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాన్ని పురష్కరించుకొని నిర్వహకులు భారీ స్థాయిలో అన్న సమారాధనలు, ప్రసాద వితరణలు చేపడుతున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



కవాతు చేస్తున్న పోలీసులు

తెర్లాం: ఎన్నికల్లో ప్రశాంతంగా పోలింగ్ జరగడానికి పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మండల పరిదిలోని ఆదివారం కాగాం, వెలగవలస, అరసబలగ, పాములవలసలో సీఐ తిరుమల రావు స్థానిక ఎస్.ఐ రమేష్ అధ్యక్షతన గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో అందరూ ప్రశాంతంగా ఓటు వేయాలని, సమస్యాత్మక వ్యక్తులు ఎవరైనా ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. అన్ని రాజకీయ నాయకులు దీనికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హోర్డింగులపై బొమ్మల తొలగింపు



ప్రభుత్వ కార్యాలయాల వద్ద అంటించిన జగన ఫొటోలను తొలగిస్తున్న అధికారుల

రాజాం: అర్బన్ హెల్త్ సెంటర్లు, సచివాలయాలకు రంగులు మార్పించ డమే కాకుండా హోర్డింగ్‌లపై ఉన్న జగన్ బొమ్మలను తొలగించి శిలాఫలకాలకు ముసుగులు వేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎన్నికల కోడ్ కూసింది శీర్షికతో ఆదివారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. అర్బన్ హెల్త్ సెంటర్లు, సచివాలయాల వద్ద ఉన్న హోర్డింగ్‌లు, శిలాఫలకాలకు రంగులు తొల గించడంతోపాటు హోర్డింగ్‌లపై ఉన్న ఫొటోలను తొలగించాలని, శిలాఫలకాలకు ముసుగులు వేయాలని పురపాలక సంఘం కమిషనర్ జె.రామప్పలనాయుడును ఎన్నికల డీటీ ప్రకాష్‌ను ఆదివారం ఆదేశించారు. దీంతో స్పందించిన అధికా రులు రంగులు మార్పించడమే కాకుండా హోర్డింగ్ లపై ఉన్న జగన్ బొమ్మ లను తొలగించి శిలాఫలకాలకు ముసుగులు వేసేలా చర్యలు తీసుకున్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

- ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు



భాస్కరరావు (ఫైల్)

రాజాం రూరల్: రాజాం పట్టణంలోని డోలపేట జంక్షన్‌లో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రాజాం ఎస్ఐ రవికిరణ్ కథనం మేరకు.. సంతకవిటి మండలంలోని అక్కరాపల్లి గ్రామానికి చెందిన నారాయణశెట్టి భాస్కరరావు(35) రాజాం మునిసిపాలిటీ పరిధిలోని బుచ్చెంపేటలో జరుగుతున్న రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో సామగ్రి అమ్మేందుకు తన సోదరుడు పార్వతీశంతో వచ్చాడు. తిరిగి శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై తన స్వగ్రామానికి వెళ్లిపోతుండగా డోలపేట నుంచి బుచ్చెంపేట వైపు ఎదురుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రేగిడి మండలం పెదలింగాలవలస గ్రామానికి చెందిన వాకముళ్ల శ్రీనివాసరావు ఢీకొన్నారు. దీంతో భాస్కరరావు అక్కడికక్కడే మృతి చెందగా పార్వతీశం, శ్రీనివాసరావు తీవ్ర గాయాలకు గురై పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. భాస్కరరావు భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదుచేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

బొండపల్లి, మార్చి 24: బైక్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఏఎస్ఐ టి.సన్యాసినాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గ్రహపతి అగ్రహారంలో అదే గ్రామానికి చెందిన నమ్మి గౌరినాయుడు(50) శనివారం సాయంత్రం బహిర్భూమి కోసం మరువాడ గ్రామ రహదారి వైపు వెళుతుండగా అదే మార్గంలో వెనుక నుంచి మరువాడ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో గౌరినాయుడు తలకి తీవ్ర గాయమైంది. దీంతో స్థానికులు వెంటనే గౌరినాయుడుని స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి వద్ద ప్రథమ చికిత్స చేయించారు. తలకి తీవ్రగాయం కావడంతో వెంటనే 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగా గౌరినాయుడు మృతిచెందినట్లు 108 వాహన వైద్యులు తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై మృతుడు గౌరినాయుడి భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆటో బోల్తా ఆరుగురికి గాయాలు

కురుపాం/రూరల్: ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం మండలం భద్రాపురం నుంచి శ్రీకూర్మం ఆలయానికి మొక్కులు చెల్లించకోవడానికి వెళ్తుండగా కురుపాం మండలం మర్రిమానుగూడ సమీపంలో ఉన్న మలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న బిడ్డిక కృష్ణ, బిడ్డిక శ్రీను, బిడ్డిక సురేష్, మోహనరావు, భారతి, ఆరిక సింగరం నకు స్వల్పంగా గాయాలు కావడంతో వీరిని స్థానికులు 108 ద్వారా సమీపంలోని వీరఘట్టం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కోడిపందెం శిబిరంపై దాడి

వేపాడ, మార్చి 24: మండలంలోని సోంపురం గ్రామంలో గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి తీర్థం సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను పట్టుకోవడంతో పాటు వారి నుంచి మూడు పందెం కోళ్లు, రూ.800లు స్వాధీన పర్చుకున్నట్టు వల్లంపూడి ఎస్ఐ కే.రాజాష్ తెలిపారు. ఈ మేరకు ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో హెచ్‌సీ సూరిబాబు, కానిస్టేబుల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

రాజాం రూరల్: తనను పొగిరికి చెందిన రౌతు సురేష్ ఇనుపరాడ్డుతో కొట్టి గాయపరిచినట్లు అదే గ్రామానికి చెందిన రౌతు రామలక్ష్మి రాజాం పోలీసులకు ఆదివారం రాత్రి ఫిర్యాదు చేసింది. తన భర్త భుజంగరావుతో సురేష్ గొడవపడి కొడుతున్న సమయంలో అడ్డుకోగా, తనపై కూడా దాడిచేసినట్లు ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు సీఐ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరస్పర ఫిర్యాదులపై కేసులు

రాజాం మండలంలోని గురవాం గ్రామానికి చెందిన సంగంరెడ్డి కల్యాణి, అదే గ్రామానికి చెందిన తొత్తిరి కల్యాణి వివాదాలకుపోయి ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ మేరకు ఇద్దరు వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవికిరణ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన చెరకు క్రషింగ్

రేగిడి: సంకిలిఈఐడీప్యారీ సుగర్స్2023-24 క్రషింగ్‌సీజన్ ఆదివారంతో ముగిసింది. ఈనెల 16తో ముగిస్తున్నట్లు యాజ మాన్యం ప్రకటించినా, ఇటీవల వర్షాల ప్రభావంతో రైతులకు ఇబ్బందిలేకుండా మరో వారం పొడిగించి క్రషింగ్ పూర్తిచేశారు. ఈమేరకు యాజమాన్య ప్రతినిధులు సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ వి.పట్టాభి రామిరెడ్డి, కేన్ డీజీఎం రాజేం ద్ర,హెచ్ఆర్ హెడ్ మేనేజర్ వి.మురళీకృష్ణ, ఫైనాన్స్ మేనేజర్ శ్యాంకుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈఏడాది చెరకు క్రషింగ్ లక్ష్యం నాలుగులక్షల మెట్రిక్ టన్నులు కాగా సీజన్ పూర్తినాటికి 3.92 లక్షల మెట్రిక్ టన్నులు క్రషింగ్ పూర్తిచేసినట్లు, సరాసరి రికవరీ 9.09 శాతం నమోదైనట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది రికవరీ 10.02 కాగా ఈ ఏడాది ప్రతికూల పరిస్థితులు దృష్ట్యా రికవరీ తగ్గినట్లు తెలిపారు. గతఏడాది అక్టోబరు 31 నుంచి క్రషింగ్ ప్రారంభించి దాదాపు ఐదునెలలు సీజన్ కొనసాగించినట్లు పేర్కొన్నారు.కర్మాగార చెరకుతోపాటు, జిల్లాలో లచ్చయ్యపేట సుగర్స్ మూసి వేతతో ప్రభుత్వ ఆదేశాలతో లచ్చయ్యపేట నుంచి 9709 మెట్రిక్ టన్నులు, భీమసింగి ఫ్యాక్టరీకి సంబందిం చి మరో 6632 మెట్రిక్ టన్నులు క్రషింగ్ చేసినట్లు తెలిపారు. ఈఏడాది ఇప్పటికి 18వేల చెరకు మమ్ము, మొక్క తోటలు ఉన్నట్లు, సాగును మరింత పెంచేందకు కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒకపక్క ఎండలు.. మరోపక్క పవర్‌కట్

- ప్రజల తీవ్ర అవస్థలు

విజయనగరం(ఆంధ్రజ్యోతి) మార్చి 24: ఒకపక్క దంచికొడుతున్న ఎండలు.. మరోపక్క మరమ్మతుల పేరిట విధిస్తున్న పవర్ కట్ కారణంగా ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆదివారం నగరంలోని తోటపాలెం, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సరఫరాను నిలిపివేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు విలవిల్లాడారు. వేసవిలో మెంటైనెన్స్ పేరుతో గంటల కొద్దీ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయమై విజయగనరం ఎస్ఈ లక్షణరావు మాట్లాడుతూ.. బ్రేకర్ మార్పు చేయడంతో విద్యుత్‌కు అంతరాయం కలిగినట్లు చెప్పారు.

ఘనంగా డోలాయాత్ర



పూల్‌బాగ్‌లో డోలాయాత్ర మండపంలో పూజలు

బొబ్బిలి, మార్చి 24: సత్యభామాసమేత వేణుగోపాలస్వామి ఆలయం పరిధిలో స్థానిక పూల్‌బాగ్‌లో ఆదివారం సాయంత్రం డోలాయాత్ర ఘనంగా జరిగింది. శ్రీవేణుగోపాల స్వామి ఆలయం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకిలో మేళతాళాలతో ఊరేగింపుగా డోలాయాత్ర మండపానికి తీసుకొచ్చి అక్కడ వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. టీడీపీ నేత బేబీనాయన స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ యాత్ర కారణంగా పూల్‌బాగ్ జంక్షన్ అంతా భక్తులతో కోలాహలంగా మారింది. ఆటవస్తువులు, తినుబండారాలు అమ్ముకునే వారితో సందడిగా తయారైంది. చిన్నారుల కోలాటం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. రాత్రి వరకు స్వామివారికి పూజాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మళ్లీ మేళతాళాలతో ఊరేగింపుగా శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి తరలించారు.

నేడు, రేపు రావాలమ్మ తీర్థం

వేపాడ: మండలంలోని చినగుడిపాల గ్రామ పంచాయతీ శివారు భోజంకివానిపాలెంలో గ్రామదేవత శ్రీరావాలమ్మ తీర్థమహోత్సవం సోమ, మంగళవారాల్లో రెండు రోజులు పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్టు గ్రామ పెద్దలు భోజంకి రామునాయుడు, గ్రామస్థులు, నిర్వహక కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తీర్థమహోత్సవాన్ని పురష్కరించుకుని మొదటి రోజు సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, మహిళా కోళాటం ప్రదర్శన, మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్న సమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. రాత్రి 7గంటల నుంచి శ్రీరామాంజనేయ యుద్ధం నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. అలాగే రెండో రోజు 26న మంగళవారం ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 3గంటల నుంచి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మెన్ వేచలపు వెంకట చినరామునాయుడు సారధ్యంలో జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నారు.

కోడ్ పాటించరా?


మోటారుపై జగన్ చిత్రపటం

సీతానగరం: పలు గ్రామాల్లో పూర్తిస్థాయిలో ఎన్నికల కోడ్ అమలు కావడం లేదు. మండలంలోని సీతానగరం, పెదభోగిల, లక్ష్మీపురం, బుడ్డిపేట, బూర్జ, చెల్లంనాయుడువలస గ్రామాల్లో వ్యవసా య మోటార్లకు సీఎం జగన్ చిత్రాలు దర్శమిస్తున్నాయి. సీతానగరం నుంచి అజ్జాడ వైపు వెళ్లే రోడ్డు పక్కనే రోడ్డుకు ఎదురుగా ప్రజలకు కనిపించే విధంగా ఈ విద్యుత్ మీటర్లు బిగించారు. అధికారులు తక్షణమే మోటార్లపై ఉన్న ఈ చిత్రాలను తొలగించాలని టీడీపీ నాయకుడు పెంట సత్యంనాయుడు, రైతు వేణుగోపాల్‌రావు, తదితరులు డిమాండ్ చేశారు.

నిబంధనలు ధిక్కరిస్తే చర్యలు తప్పవు

గరుగుబిల్లి: గ్రామాల్లో ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో పి.సూర్యనారాయణ, తహసీల్దార్ జయ హెచ్చరించారు. మండలంలోని తోటపల్లి, గిజబ, సంతోషపురం పంచాయతీలను వారు ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీల పోస్టర్లు, బ్యానర్లు ఉంచరాదన్నారు. గృహాలకు అంటించిన స్టిక్కర్లను తొలగించాలని కోరారు. నిబంధనలు పాటించకుంటే ఎన్నికల నియమావళి మేరకు కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ప్రచారాలకు విధిగా అనుమతులు ఉండాలన్నారు. ఈ పరిశీలనలో ఎఫ్ఎస్‌టీ అధికారి బి.గౌరీశంకరరావు, జి.కృష్ణ, తేజ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

గంట్యాడ: సార్వత్రిక ఎన్నికలు గ్రామాల్లో సజావుగా జరిగే విధంగా అందరూ సహకరించాలని ఎస్ఐ సుదర్శననాయుడు కోరారు. ఆదివారం తాటిపూడి గ్రామంలో ఎన్నికల నిర్వహణపై గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో ఎటువంటి అల్లర్లు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు


కందులపథంలో కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

సాలూరు రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో కేంద్ర బలగాలకు చెందిన సాయుధ పోలీసులు కవాతు నిర్వహిస్తున్నారు. కందులపథం, మావుడి గ్రామాల్లో ఆదివారం కవాతు నిర్వహించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేలా భరోసా కల్పించేందుకే ఈ కవాతు నిర్వహిస్తున్నామని ఎస్ఐ ఎం.వెంకటరమణ తెలిపారు. ● **భోగాపురం:** మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో సీఐ ఎ.రవికుమార్, ఎస్ఐలు సూర్యకుమారి, తాతారావు ఆధ్వర్యంలో ఆదివారం కవాతు నిర్వహించారు. పోలిపల్లి, లింగాలవలస గ్రామాల్లో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్సుతో కవాతు చేశారు. ఎన్నికల్లో ఎటువంటి ఘటనలకు పాల్పడినా కేసులు తప్పవన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

భామిని: ఎన్నికల నిబంధనలు మేరకు బత్తిలి పోలీసులు ఎస్ఐ సీహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆంధ్రా, ఒడిశా రాకపోకలు సాగించే వాహనాలను ఆదివారం తనిఖీ చేశారు. వాహనదారులకు పలు సూచలు చేశారు. మాదక ద్రవ్యాలు, డబ్బు తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రూ.50వేలకు మించి డబ్బు తరలిస్తే వాటికి సంబంధించిన పత్రాలు పక్కాగా ఉండాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై వర్క్‌షాపు

గరుగుబిల్లి: పర్యావరణ, ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రకృతి వ్యవసాయం చేయాలన్న సందేశాన్ని పిల్లల ద్వారా తల్లిదండ్రులకు పంపించాలని జట్టు సంస్థ చర్యలు చేపడుతోంది. ఈనేపథ్యంలో జట్టు వ్యవస్థాపకుడు డా.డి.పారినాయుడు ఆధ్వర్యంలో ప్రముఖ రచయితలతో వర్క్‌షాపులు నిర్వహిస్తూ అభినయ గీతాలను రూపొందించారు. ఈ మేరకు ఆదివారం ప్రారంభమైన సుస్వర గేయ సంపద కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ పారినాయుడు, కన్సల్టెంట్ టి.శివాజీ, కవి, రచయిత పక్కి రవీంద్రనాథ్ పాల్గొన్నారు. ఈ పాటలను పాడడం కోసం కొంకడివరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, పార్వతీపురం కేపీఎం పాఠశాలల విద్యార్థినులను ఎంపిక చేశారు. ఈ గీతాలకు సంగీతాన్ని వి.సన్యాసిరావు సమకూర్చగా, కీబోర్డ్ సహకారాన్ని డి.రమేష్‌నాయుడు అందించారు.

రైతులకు నష్ట పరిహారం అందజేయాలి

చీపురుపల్లి: గత మంగళవారం కురిసిన వర్షానికి, గాలుల బీభత్సానికి దెబ్బతిన్న మొక్కజొన్న, అరటి పంటలకు తక్షణమే నష్ట పరిహారాన్ని అందజే యాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం ఆయన పత్తికాయవలసలో నష్టపోయిన అరటి రైతుల్ని పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతుల్ని ఇప్పటి దాకా అధికార పార్టీ నాయకులు పరామర్శించకపోవడం శోచనీయమన్నారు. నివేదికలు తయారు చేసి, పరిహారం తక్షణమే విడుదల అయ్యేలా చూడాలని ఆయన డిమాండ్ చేశా రు. ఆయన వెంట జనసేన పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


తోటపల్లి పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గరుగుబిల్లి: తోటపల్లిలో జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 2009-10 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల వద్ద ఆత్మీయంగా కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విశ్రాంత ఎంఈవో శంబాన చంద్రశేఖర్, హెచ్ఎం ప్రపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం అందించండి


నిరసన చేస్తున్న గిరిజనులు

పాచిపెంట: గిరిజనులకు మెరుగైన వైద్య సహాయం అం దించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరా వు కోరారు. మండలంలోగల కుడుమూరు, మెట్టవలస, తోకమెట్ట గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించి అక్కడి స్థితిగతులను తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో జ్వరాలు ఉన్నాయని, ముందు జాగ్రత్త చర్యగా వైద్య శిబిరాలు నిర్వహిస్తూ సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. అనారోగ్యం బారిన పడకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం తోకమెట్ట వద్ద గిరిజనులు నిరసన చేపట్టారు.

శిష్టకరణాల ఐక్యతకే వివాహ పరిచయ వేదిక


పరిచయ వేదిక నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట: ఉత్తరాంధ్ర జిల్లాల్లోకి శిష్టకరణ కులస్థులు అందరూ ఐక్యతతో ముందుకు సాగేందుకే వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేసినట్టు జిల్లా శిష్టకరణ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంపీజీ ఈశ్వరరావు, రేగా సురేష్ తెలిపారు. ఆదివారం గుంటూరు వారు వీధిలోని బృందావన్ అపార్టుమెంటులో శిష్టకరణాల కుటుంబ సభ్యుల వివాహ పరిచయ వేదిక జరిగింది. కార్యక్రమానికి 100 మంది కుటుంబ సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో శిష్టకరణ సంఘ ప్రతినిధులు సంజీవరావు, రవికుమార్‌తో పాటు వివిధ మండలాల నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

● జిల్లా వ్యాప్తంగా క్రైస్తవుల ర్యాలీ
● చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు మట్టల ఆదివారం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఈత, కొబ్బరి కొమ్మలను చేత పట్టుకుని గీతాలు ఆలపిస్తూ ర్యాలీ చేశారు. ఏసును శిలువ వేసే ముందు యూదుల రాజుగా ప్రకటించిన రోజునే మట్టల ఆదివారంగా జరుపుకుంటున్నారని మత పెద్దలు చెప్పారు. చర్చి పాస్టర్‌లు, ఫాదర్‌లు, పెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు.
- (ఆంధ్రజ్యోతి బృందం)


పార్వతీపురంటౌన్‌లో..


గరుగుబిల్లిలో..


కురుపాంలో ..


భామినిలో..


జియ్యమ్మవలస: చినమేరంగిలో..

ఎమ్మెల్యే గన్‌మన్ ప్రమాద ఘటనపై దర్యాప్తు చేయాలి

గరుగుబిల్లి: ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి వద్ద గన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న బోను తిరుమలరావు ప్రమాద ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించాలని టీడీపీ అరకు బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. చిలకాం గ్రామంలో ఆయన ఆదివారం మాట్లాడారు. ప్లాట్ పైనుంచి పడిన ఎమ్మెల్యే గన్‌మెన్‌కు గుట్టు చప్పుడు కాకుండా వైద్య సేవలు అందించడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి భర్త సన్యాసినాయుడును విధులు నుంచి సస్పెండ్ చేయడం విచారకరమన్నారు. మాజీ ఎంపీపీ డి.గౌరమ్మ, పార్టీ ప్రతినిధులు బి.నారాయణస్వామి, కె.బలరాంనాయుడు, ఎ.నారాయణరావు పాల్గొన్నారు.

సన్యాసిరావు సస్పెండ్ దురదృష్టకరం

గుమ్మలక్ష్మీపురం: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి భర్త అడ్డాకుల సన్యాసినాయుడును సస్పెండ్ చేయడం దురదృష్టకరమని పార్టీ నాయకులు పాడి సుదర్శనరావు, అడ్డాకుల నరేష్ అభిప్రాయపడ్డారు. రాజకీయాలకు దూరంగా ఉండే ఉపాధ్యాయుడు సన్యాసిరావును ప్రభుత్వ క్వార్టర్‌లో ఉంటున్నారన్న కారణంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా సస్పెండ్ చేయడం దురదృష్టకరమన్నారు.

నేటి నుంచి బంగారమ్మ తల్లి పండగ

మక్కువ: మండలంలోని కొండబుచ్చింపేట, సరాయివలస గ్రామాల ఆరాధ్య దేవత శ్రీబంగారమ్మతల్లి పండగను సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నారు. చాలా సంవత్సరాల తర్వాత పండగ రావడంతో సుదూర ప్రాంతాల్లో ఉండే బంధువులు గ్రామాలకు చేరుకున్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

భోగాపురం: భోగాపురం గ్రామంలో ఆదివారం ఎల్లమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం పూజారిని పుర వీధుల్లో ఘనంగా ఊరేగించారు.


ఎల్లమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు


సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవు

● డీఎంహెచ్‌వో జగన్నాథరావు


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

గరుగుబిల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్య సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బగాది జగన్నాథరావు అన్నారు. శనివారం రాత్రి గరుగుబిల్లి ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలన్నారు. రోగులకు అవసరమైన మందులు కేంద్రాలకు నిర్దేశించిన సమయంలోగా సరఫరా చేస్తున్నామని చెప్పారు. రికార్డుల నిర్వహణలో అలసత్వం వహించకూడదన్నారు. రోజువారీ రోగుల సంఖ్య, మందుల పంపిణీపై సిబ్బందిని ఆరా తీశారు. ఈ పరిశీలనలో డాక్టర్ కేకే సాగర్ వర్మ, ఎస్.సంతోష్‌కుమార్, స్టాఫ్‌నర్సు సునీత ఉన్నారు.

పోలమాంబ ఆలయానికి క్యూకట్టిన భక్తులు



మక్కువ: శంబర పోలమాంబ అమ్మ వారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. చదురుగుడిలో పూజలు నిర్వహించారు. వనం గుడి వద్ద వేపచెట్టుకు మహిళలు కోళ్లు, చీరలతో మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం పదో వారం జాతర సందర్భంగా వనం గుడి వద్ద ప్రముఖ పండితుడు కె.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహిస్తామని, అనంతరం మహాన్నదానం ఏర్పాటు చేస్తున్నామని ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా..

అరకు ఎంపీ కూటమి అభ్యర్థిగా కొత్తపల్లి గీత

పార్వతీపురం, (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఆదివారం రాత్రి బీజేపీ అధిష్ఠానం విడుదల చేసింది. టీడీపీ, జనసేన పార్టీతో పొత్తులో భాగంగా అరకు పార్లమెంట్ స్థానానికి కూటమి ఎంపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీత పేరును ఖరారు చేసింది. గతంలో వైసీపీ తరఫున ఆమె అదేస్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. అనంతరం ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. ఆ తర్వాత సొంతంగా పార్టీ పెట్టి.. బీజేపీలోకి విలీనం చేశారు. ప్రస్తుతం బీజేపీ నుంచి ఆమె అరకు స్థానం నుంచి రెండోసారి ఎంపీగా పోటీ చేయనున్నారు. జిల్లాలో పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గాలు అరకు పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి.

'ఆదర్శ'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భామిని: ఏపీ ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపుల్లో దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.150 రుసుం చెల్లించాలన్నారు. ఈ ఏడాది మే 22లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

టీడీపీతోనే సంక్షేమం

గరుగుబిల్లి: టీడీపీతోనే సంక్షేమం సాధ్యమవుతుందని పార్టీ రాష్ట్ర ప్రతినిధి మరడాన తవిటినాయుడు అన్నారు. ఉల్లిభద్రలో ఆదివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. ● **సీతానగరం:** బుక్కుపేట గ్రామంలో సర్పంచ్ గొట్టాపు మంగమ్మ, అప్పారావు, పార్టీ మండల అధ్యక్షుడు సత్యంనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరఘట్టం: వీరఘట్టం ఉపకేంద్రంలో నిర్వహణ పనుల వల్ల సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ బాలాజీ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: దుడ్డుఖల్ పంచాయతీ కొత్తవలస గ్రామంలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను గిరిజన సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు నిమ్మక సింహాచలం, జనసేన కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి కద్రక మల్లేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పాఠకుల చెంతకే పుస్తకాలు

చీపురుపల్లి: తాను నెలకొల్పిన మొబైల్ లైబ్రరీ ద్వారా పుస్తకాలను పాఠకుల చెంతకు చేరుస్తున్నట్టు ఆశయ ట్రస్ట్ అధ్యక్షుడు రెడ్డి రమణ తెలిపారు. ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల వద్ద ఆయన ఆదివారం మొబైల్ లైబ్రరీని ఏర్పా టు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ర్థులు పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు.

వైభవంగా కనకమహాలక్ష్మి అమ్మవారి మారు జాతర

చీపురుపల్లి: శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి మారు జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఈ జాతరకు పెద్దఎత్తున భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. జాతర మూడో రోజైన గత మంగళవారం వర్షం, గాలులు బీభత్సం సృష్టించడంతో అమ్మవారి దర్శనానికి అంతరాయం ఏర్పడింది. దీంతో ఆదివారం జరిగిన మారు జాతరకు భక్తులు పెద్దఎత్తున హాజరయ్యా రు. ఇదిలా ఉండగా, మారు జాతర సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో జి.శ్రీనివాస్, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి దర్శనానికి క్యూ లైన్లో వేచిన ఉన్న భక్తులు

జనసేనలోకి భారీ చేరికలు


పార్టీలో చేరినవారితో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవి

డెంకాడ: పెదతాడివాడ పంచాయతీలో వైసీపీకి చెందిన సుమారు 50 కుటుంబాలు ఆదివారం జనసేన పార్టీలోకి చేరాయి. ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి ఆధ్వర్యంలో, టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, ఐవీపీ రాజు, జనసేన నాయకుడు కాకర్లపూడి శ్రీనివాసరావు సమక్షంలో వీరంతా టీడీపీ, జనసేన కండువాలు కప్పుకున్నారు. పార్టీలో చేరినవారిలో మాజీ ఎంపీటీసీ చింతపల్లి రామ్మూర్తి, వైసీపీ నాయకులు దంతులూరి చిరంజీవిరాజు, గాదెపల్లి చినరామ్మూర్తి, ఆదినారాయణ ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాణిరాజు, తమ్మినాయుడు, గేదెల రాజారావు, పల్లె భాస్కరరావు, కడగల ఆనంద్‌కుమార్, చిల్లా పద్మ, తుమ్మి లక్ష్మీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఇప్పలవలస వేదికగా వెయ్యి కుటుంబాలు..

మెంటాడ: ఇప్పలవలస గ్రామం వేదికగా ఆదివారం జనసేన పార్టీలోకి భారీ చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జనసేన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండలంలో 15 గ్రామాలకు చెందిన సుమారు వెయ్యిమంది జనసేన పార్టీలో చేరగా, వారిని ఆయన కండువాలు కప్పి, ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో ఇప్పలవలస మాజీ ఎంపీటీసీ చింత కాశీనాయుడు, సాలూరు మాజీ కౌన్సిలర్ నాగార్జున, ఇప్పలవలస మాజీ సర్పంచ్ చింత సీతమ్మ, మీసాలపేట మాజీ సర్పంచ్ లెంక వెంకటరమణ, రాబంద మాజీ సర్పంచ్ పాపినాయుడు, కూనిబిల్లి వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రిషివర్ధన్, ఆదాడ మోహనరావు, టీడీపీ నాయకుడు చలుమూరి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

విజయం అందించండి

బొండపల్లి: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు విజయం అందించాలని కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ సముదాయం సమీపంలో విస్తృత స్థాయి మండల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ సంస్థాగతంగా బలంగా ఉన్న టీడీపీ శ్రేణులు ముందుండి తనను నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పడాల అరుణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రాపు సురేష్, బీజేపీ నాయకుడు దేవర ఈశ్వరరావు, బొండపల్లి, గంట్యాడ మాజీ ఎంపీపీలు కొండపల్లి కొండలరావు, బండారు కృష్ణమూర్తి, బొడ్డు రాములతోపాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు విడుదలచేయాలి

రేగిడి: ఉమ్మడి విజయనగరం, పార్వతీపురం-మాన్యం జిల్లాలో దాదాపు ఐదు వేల మందికి రైతుల ధాన్యం బకాయిలు కలెక్టర్లు విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు డిమాండ్‌చేశారు. ఆదివారం రేగిడిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెండ నెలలుగా ధాన్యం బకాయిలకోసం రైతులు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నా పట్టించుకోవడం లేదని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రూ. 60కోట్లు బకాయి ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, తక్షణమే రెండు జిల్లాల కలెక్టర్లు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

కామాక్షి ఆలయంలో ప్రత్యేక పూజలు

సాలూరు రూరల్: ఫాల్గుణ మాస పౌర్ణమి సందర్భంగా స్థానిక కామాక్షి ఆలయంలో ఆదివారం రాత్రి హోమం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామా ఉచిత యోగా కేంద్రంలో గౌరీ నాయుడు ఆధ్వర్యంలో హోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.